క్లుప్తంగా

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



తెనాలిఅర్బన్: మురుగు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 14వ వార్డులో గురువారం ఉదయం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. మురుగు కాల్వలను బాగు చేయాలని స్థానికులు కోరారు. దీనిపై స్పందించిన ఆమె మురుగు కాల్వలో పూడికతీత పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, హార్టికల్చర్ ఆఫీసర్ శేషుబాబు, వార్డు నాయకులు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

దీపాలు, నీటి కుళాయిలు ఏర్పాటు చేయండి



తెనాలిఅర్బన్: పోలింగ్ కేంద్రాల్లో నీటి కుళాయి ట్యాప్‌లు, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలోని 6,10,11,17,38, 40 వార్డులోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏసీపీ సుబ్బారావు, ఏఈ చైతన్య, పలువురు సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

తెనాలిలో డీఆర్‌ఎం ఆకస్మిక తనిఖీ



తెనాలిరూరల్: తెనాలి రైల్వేస్టేషన్‌ను విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఆనంద్‌రావ్ పాటిల్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా వచ్చిన ఆయన సీనియర్ సెక్షన్ ఇంజినీర్ కార్యాలయం, ఇతర రైల్వే విభాగాల కార్యాలయాలు, ఉత్తర క్యాబిన్, స్టేషన్‌లోని ప్లాట్ ఫాంలతో పాటు రైల్వే ట్రాక్‌లను పరిశీలించారు. స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను ఆరా తీశారు. ప్రయాణికుల భద్రత కోసం రైల్వే ట్రాక్‌ల పునరుద్ధరణ, తెనాలి నుంచి గుంటూరు వెళ్లే రైలు మార్గం అభివృద్ధి చేసే అంశాలను అధికారులతో చర్చించారు. ఆయన వెంట స్టేషన్ మేనేజర్ టి.వెంకటరమణ ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పేరలి(కర్లపాలెం): విద్యార్థులు ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ప్రముఖ సంఘ సేవకులు మోపర్తి జాన్ సూచించారు. కేర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు, ప్రముఖ సంఘ సేవకులు మోపర్తి జాన్ గురువారం పేరలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లతో కూడిన కిట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉన్నత చదువులకు వెళ్లాలని తద్వారా తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పాఠశాల హెచ్‌ఎం అపర్ణ, మిషన్స్ డైరెక్టర్ స్టీవ్ కొలిన్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అద్దేపల్లిలో ఆరోగ్య సురక్ష శిబిరం

భట్టిప్రోలు: భట్టిప్రోలు-2 సచివాలయం పరిధిలోని అద్దేపల్లి ఎంపీయూపీ స్కూల్ ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జెబీవీ మల్లికార్జునరావు గురువారం తెలిపారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీల వైద్యులు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ స్పెషలిస్ట్ డాక్టర్లు, కంటి వైద్య నిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, సర్పంచ్ మోర్ల విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు రావు రాజేశ్వరి, కోఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని వివరించారు. వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ఈ క్యాంప్‌లో పాల్గొంటారని సర్పంచ్ దారా రవికిరణ్మయి తెలిపారు.

రజకులకు జగనన్న పెద్దపీట వేశారు

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్ వేదికపై పరిశీలకుడు శేషగిరిరావు, ఎంపీపీ చెన్నకేశవులు

తెనాలిరూరల్: నియోజకవర్గ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా రజక సామాజిక వర్గీయులకు గత నాలుగేళ్ల 10 నెలల కాలంలో రాజకీయంగా పెద్దపీట వేశామని, రాష్ట్రంలోనే తొలిసారి రజక సామాజికవర్గ వ్యక్తి ఎంపీపీని చేశామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. తెనాలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ రజక ఆత్మీయ సమావేశాన్ని గురువారం రాత్రి స్థానిక కొత్తపేటలోని దేవిప్రియ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేశారు.

ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సిద్దాంతాలకు అనుగుణంగా వేనుకబడిన సామాజిక వర్గాలకు చేయూత అందించామన్నారు. ఎంపీపీ పదవితో పాటు ఇద్దరు మహిళలకు మున్సిపల్ కౌన్సిలర్లుగా, మరో ఇద్దరికి మార్కెట్ యార్డు డైరెక్టరుగా, మరో వ్యక్తికి వైకుంఠపుర దేవస్థాన కమిటీ మెంబరుగా అవకాశం కల్పించినట్టు వివరించారు.

గతంలో ఏ పాలకుడూ రజక సామాజికవర్గానికి ఇంత ప్రాధాన్యత ఇవ్వలేదని గుర్తు చేశారు. అన్ని వర్గాలకు రాజ్యాధికారం రావాలన్నది రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయమని, దానికి అనుగుణంగా రాజ్యాంగాన్ని రచించారని, అదే అంబేడ్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. ఎంతో చైతన్యవంతమైన తెనాలి ప్రాంతంలో వెనుకబడిపోయిన రజకులకు రాజ్యాధికారం కల్పించేదిశగా అనేక చర్యలు తీసుకున్నామన్నారు. 2019లో అధికారంలోకి వచ్చాక రెండేళ్లు కరోనా కారణంగా ఎన్నో ఇబ్బందులు పడినా, మిగిలిన రెండేళ్ల 10 నెలల కాలంలో అన్ని విధాలా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

కరోనా విపత్కర కాలంలో ప్రజల ప్రాణ, ఆరోగ్య రక్షణకు పెద్దపీట వేస్తూ అత్యధికంగా ఖర్చు చేయాల్సి వచ్చిందని, అయినా సంక్షేమాన్ని ఆపకుండా ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో రజక సామాజిక వర్గీయులందరూ వైఎస్సార్‌సీపీకి మద్దుగా నిలవాల్సిన అవసరముందన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా రజక సామాజిక వర్గ వ్యక్తిని ఎంపీపీగా చేయడం ఆదర్శనీయమన్నారు.

ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు మాట్లాడుతూ తమ సామాజికవర్గానికి పెద్దపీట వేసిన ఎమ్మెల్యే శివకుమార్‌కు రజకులందరూ అండగా నిలుస్తారని చెప్పారు. ధరణికోట మల్లికార్జునరావు అధ్యక్షత వహించగా, 24, 38 వార్డు కౌన్సిలర్లు పెదలంక లక్ష్మీలావణ్య, వీర్లపాటి విజయలక్ష్మి, ఓలేటి శివాజీ, ఇ.నాగమల్లేశ్వరి, పెసర్లంక రమణ, ఉప్పలపాటి సాయికృష్ణ, పెదలంక వెంకటేశ్వరరావు, ఎస్.కొండలరావు, మునిపల్లి వంశీ, మేడేపల్లి ప్రభాకర్, కె.లక్ష్మయ్య తదితరలు మాట్లాడారు. నియోజకవర్గంలోని రజక సామాజికవర్గీయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభకు తొలుత గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా సభాస్థలికి చేరుకున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



గౌడౌన్ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు ఉపయోగపడే విధంగా గోడౌన్‌ను నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సొసైటీ) ఆవరణలో రూ.58 లక్షలతో నిర్మాణం చేపట్టిన గోడౌన్‌కు గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులను గోడౌన్‌లో నిల్వ చేసుకుని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చన్నారు. సొసైటీ పరిధిలో రైతులు అభివృద్ధికి గోడౌన్‌ను నిర్మిస్తున్నామని, రైతులు దీనిని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్‌పర్సన్ తోటకూర వసంతరావు, ఎంపీటీసీ సభ్యులు షేక్ షిలార్ జానీ, వైఎస్సార్‌సీపీ నాయకులు బొంతు నరేంద్రరెడ్డి, వేముల మహేష్, తన్నీరు వెంకటేశ్వరరావు, దూళిపాళ్ల దుర్గాప్రసాద్, కసుకుర్తి దానియేలు, కమాదుల స్వామి, ప్రహ్లాద రెడ్డి, మేకల రవికుమార్, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ బీసీనేత కందుల



ఎమ్మెల్యే శివకుమార్‌తో కందుల వేణువర్ధన్, గౌడనేతలు, పార్టీ నాయకులు

తెనాలి: తెలుగుదేశం పార్టీకి చెందిన బీసీ నేత కందుల వేణువర్ధన్ వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆయనకు పార్టీ కండువాను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. బీసీ గౌడ కులానికి చెందిన యువనేత కందుల వేణువర్ధన్ పార్టీలో చేరటం శుభపరిణామంగా ఎమ్మెల్యే చెప్పారు. వేణువర్ధన్ తండ్రి కందుల సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ గౌడ నేతగా బీసీ ఉద్యమంలో పాల్గొన్నారని, ఆయన తనకు సన్నిహితులను చెప్పారు. 2019 ఎన్నికల్లో తన గెలుపుకు ఆయన విశేషకృషి చేసినట్టు గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు ఆయన తనయుడు వేణువర్ధన్, ఎన్నికల తరుణంలో పార్టీలో చేరటం సంతోషంగా ఉందన్నారు. తండ్రి సూచనలు, సలహాలతో పార్టీ బలోపేతానికి కృషిచేస్తారని నమ్ముతున్నానని అన్నారు.

వేణువర్ధన్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెనాలి నియోజకవర్గంలో అన్నాబత్తుని శివకుమార్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, తెనాలి ఎమ్మెల్యేగా అన్నాబత్తుని శివకుమార్‌లు మరోసారి ఎన్నికవటం తథ్యమని చెప్పారు. నియోజకవర్గంలో పేద, మధ్యతరగతి వర్గాలకు రూ.1800 కోట్ల సంక్షేమాన్ని నేరుగా ఖాతాల్లో జమచేయించటమే కాకుండా రికార్డుస్థాయిలో 27 వేల మందికి ఇళ్ల స్థలాల పట్టాలను ఇచ్చిన ఘనత శివకుమార్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు మందపాటి శేషగిరిరావు, పట్టణ క్లస్టర్-2 అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు, పట్టణ అధికార ప్రతినిధి అక్కిదాసు కిరణ్‌కుమార్, పార్టీ నేతలు శానంపూడి రఘురామిరెడ్డి, పెదలంక వెంకటేశ్వరరావు, తోక వాసు, డాక్టర్ గోడే సుబ్రహ్మణ్యం, రాగిపూల లక్ష్మి, రుద్రపాటి చెన్నకేశవులు, కుంభం బాలాజీ గౌడ్, అద్దంకి వేణుగోపాల్‌గౌడ్, కాళిదాసు వెంకటేశ్వరరావు, కొడాలి క్రాంతి, తట్టుకూళ్ల అశోక్‌యాదవ్, పెసర్లంక రమణ, అద్దంకి బోసుబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

27న తెనాలిలో డాక్ అదాలత్

తెనాలిఅర్బన్: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెనాలి కొత్తపేటలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈనెల 27న డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ శొంఠి రవికిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా సేవలు అందుకునే విషయంలో ఏమైనా ఫిర్యాదులు ఉంటే డాక్ అదాలత్ తెలియజేసి పరిష్కారం పొందవచ్చని చెప్పారు. సాయంత్రం 4.30గంటల నుంచి డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. వ్యక్తిగతంగా ఫిర్యాదు చేయడానికి అవకాశం లేని వారు ఈ నెల 25 తేదీలోపు ది సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ తెనాలి డివిజన్, తెనాలి-522201 చిరునామా ద్వారా లేటర్ పంపవచ్చని వివరించారు.

బండ్లమ్మ ఆలయంలో బహిరంగ వేలం



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు బండ్లమ్మ దేవాలయంలో వంట సామగ్రి, టెంట్ సామగ్రి హక్కుల కోసం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ బండ్లమ్మ దేవాలయంలో కల్యాణ మండపంలో జరుగు కార్యక్రమాలకు అవసరమైన సామాన్లు, కుర్చీలు, సరఫరా చేయుటకు గాను లైసెన్సు పొందుటకు బహిరంగ వేలం నిర్వహించినట్లు తెలిపారు. వేలంలో హెచ్చు పాటదారునిగా కుంచలవారిపాలెం గ్రామానికి చెందిన కుంచల జయరెడ్డి రూ.68 వేలకు అనుమతులు పొందినట్లు చెప్పారు. గతంలో పాట కంటే ఈసారి అదనంగా రూ.33 వేలు అధికంగా ఆదాయం లభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ బాపట్ల డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.శ్యామల, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, సభ్యులు బుడ్డా వెంకట లక్ష్మి, తుమ్మా జోగేశ్వరరెడ్డి ఉన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం



మాట్లాడుతున్న యారం వనజ

కర్లపాలెం: పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీపీ యారం వనజ తెలిపారు. పేరలిపాడు గ్రామంలో గురువారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహార ఆవశ్యకతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ పౌష్టికాహార లోపం వలన అత్యధిక శాతం మహిళల్లో రక్తహీనత ఏర్పడుతుందని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని మౌనిక, కార్యదర్శి కాంచన, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

అల్లమూడి(భట్టిప్రోలు): పోషకాహార లోపానికి గురైన పిల్లలను అంగన్‌వాడీ కార్యకర్తలు గుర్తించి అనుబంధ పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫజరున్నీస్సా పేర్కొన్నారు. అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పల్లెకోన సెక్టార్ పరిధిలోని అల్లమూడిలో గురువారం పోషణ్ పఖ్వాడ్ కార్యక్రమం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ అనుబంధ పోషకాహారంపై గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఎథికల్ స్టెప్స్‌పై అవగాహన

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట మలినేని లక్ష్మియ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఐటీ విద్యార్థినులకు హక్ బోట్స్ ఆధ్వర్యంలో స్టార్ట్ అప్ ప్లానింగ్, లీగల్, ఎథికల్ స్టెప్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హక్‌బోట్స్ సీఈవో ఎస్ఆర్‌కే మహేన్, స్టార్టప్ ఐడియాస్ నిపుణుడు టి.ప్రసాద్‌లు హాజరయ్యారు. ప్రోడక్ట్ ఇన్నోవేషన్స్, మ్యానుఫ్యాక్చర్ లెవల్స్, ఇన్వెస్ట్‌మెంట్ లెవల్స్, క్రియేటివ్ ఇన్నోవేషన్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు, ప్రిన్సిపల్ జె. అప్పారావు, డీన్ కిషోర్ బాబు, రమేష్‌బాబు, అధిపతులు పాల్గొన్నారు.

• సిద్ధంగా ఉండండి



వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను గెలిపించేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. పట్టణంలోని 8వ వార్డులో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి ఓట్లు అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, మట్లపూడి రాజేశ్వర రావు, తట్టుకుళ్ళ ఆశోక్ యాదవ్, చుండూరు సాయి, పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – తెనాలి అర్బన్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న మోపిదేవి

రేపల్లెరూరల్: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగ పడుతుందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని పిరాట్లంక గ్రామానికి చెందిన ధూళిపాళ్ల శోభన్‌బాబుకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.56 వేల చెక్కును గురువారం పట్టణంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో అందజేసి మాట్లాడారు. మోళ్లగుంట గ్రామానికి చెందిన విశ్వనాథపల్లి శ్రీనివాసరావుకు వారి పిల్లల చదువులకై రూ.50 వేలను వ్యక్తిగత సాయంగా అందజేశారు. కార్యక్రమంలో పిరాట్లంక మాజీ సర్పంచ్ ధూళిపాళ్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

సురక్ష మెడికల్ క్యాంప్‌లతో ఎంతో మేలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న



అర్బన్ మార్కెట్‌ల ఉత్పత్తులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, వైస్ చైర్మన్ హరిప్రసాద్

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లు పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు పేర్కొన్నారు. గాంధీనగర్-2 సచివాలయ సమీపంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. స్పెషాలిస్ట్ వైద్యులు వైద్య సేవలు అందించారు. డాక్టర్ బీబీజాన్ మాట్లాడుతూ జనరల్ ఓపీ 142, ఆర్థోపెడిక్ 78, ఆప్తామాలజీ 42, గైనకాలజీ 51 మందికి వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, డాక్టర్ ఎస్‌కె.సౌమ్య, డాక్టర్ రవికుమార్‌నాయక్, డాక్టర్ వినోద్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, పలువురు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ మార్కెట్‌లను ఆదరించండి

తెనాలిఅర్బన్: స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులను అర్బన్ మార్కెట్ల ద్వారా విక్రయిస్తున్నట్లు వాటిని అందరూ ఆదరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ సూచించారు. మున్సిపల్ కార్యాలయం ముందు గురువారం ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహంతో స్వయం సహాయక సంఘ సభ్యులు అనేక వ్యాపారాలు చేస్తున్నారని తెలిపారు. పిండి వంటలు, పచ్చలు, తినుబండరాలు వంటి వాటిని తయారు చేసి విక్రయిస్తున్నట్లు చెప్పారు. కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మూడు నెలలకు ఒకసారి మున్సిపల్ కార్యాలయం అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజుల పాటు మార్కెట్ కొనసాగుతుందన్నారు. ప్రజాదరణ దృష్ట్యా ప్రతి నెల దీనిని ఏర్పాటు చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. ప్రజలందరూ ఇలాంటి వ్యాపారాలను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎంలు వి.మాధవరావు, సిహెచ్.అరుణకుమారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

అమరవీరుల స్మరణ.. అందరి బాధ్యత



సభలో మాట్లాడుతున్న లక్ష్మయ్య

తెనాలిటౌన్: పోలీసు కాల్పులలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులను స్మరించుకోవడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని గరువుపల్లిలోని సచివాలయం-2 వద్ద బుధవారం రాత్రి అమరవీరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో 1968లో జరిగిన పోలీసు కాల్పుల్లో మృతి చెందిన మంచికలపూడి సుబ్బారావు, మునిపల్లి క్రిష్టాఫర్ లను స్మరించుకుంటూ పల్లె తొలితరం పోరాట యోధులకు పలువురు నాయకులు, వక్తలు జోహార్లు అర్పించారు. సామాజిక వేత్త ఉన్నం లక్ష్మయ్య అధ్యక్షత జరిగిన సభలో ఆ రోజుల్లో జరిగిన సంఘటనలు, కుల వ్యవస్థ గురించి పలువురు వక్తలు ప్రసంగించారు. కళల కాణాచి కొలకలూరు చరిత్ర గురించి డాక్యుమెంటరీ రూపంలో తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు.

కర్రసాము, కత్తిసాము, నాట కాలు, డప్పు కళాకారులు, కబడ్డీ, క్రీడాకారులు, కవులు, కళాకారులు, రచయితలకు నిలయమైన కొలకలూరు గురించి రాబోయే తరాలను తెలియజేయడానికి అందరూ సహకరించాలని కోరారు. ఏఎస్‌యు ప్రొఫెసర్ డాక్టర్ పీజే రత్నాకర్, బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి యంద్రపాటి అశోక్ కుమార్, దళిత నాయకుడు సాంబశివరావు, విశ్రాంత పోస్టల్ ఉద్యోగి సుద్దపల్లి శరత్ వెంకయ్య, కళాకారుడు మోపర్తి డేవిడ్ రాజులు ప్రసంగించారు.

సభాధ్యక్షులు లక్ష్మయ్య విశ్లేషణ చేయగా న్యాయవాది మురళీధర్ సభా పరిచయం చేయగా ఐవోసీ డీలర్ యడ్లపల్లి రవికిరణ్, వందన సమర్పణ చేశారు. కార్యక్రమాన్ని ఆహ్వాన కమిటీ సభ్యులు కొలకలూరి పాపరావు, సుద్దపల్లి కనకరాజు, శీలం వినయ్‌కుమార్, కోడూరు సుదర్శనబాబు, పొన్నెకంటి చక్రవర్తి, అంబేడ్కర్‌లు పర్యవేక్షించారు.

మద్దతు ధరల చట్టం కోసం ప్రదర్శన

తెనాలి: రైతులు పండించే పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని, రైతు రుణాలను మాఫీ చేయాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని కోరుతూ సీఐటీయూ, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ప్రదర్శన చేశారు. స్థానిక మార్కెట్ సెంటర్లో జరిగిన ప్రదర్శన నుద్దేశించి సీఐటీయూ జిల్లా నాయకుడు కె.బాబూప్రసాద్ మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరుగుతున్న భారీ బహిరంగ సభకు మద్దతుగా పట్టణంలో సంఘీభావ ప్రదర్శన చేపట్టినట్టు చెప్పారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు సీ2 ప్లస్ 50 శాతం ఫార్ములా అమలుచేయాలని, రైతుల అప్పులు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసించాలని కోరారు. ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్ వలి, మంగళగిరి వెంకటేశ్వర్లు, చుక్కపల్లి శేషగిరిరావు, ముత్యాల సుభద్ర, బండి రమణమ్మ, పిల్లి సుహాసిని, రైతు నాయకులు ముద్దన సాంబశివరావు, మాగంటి యల్లమందయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో సేవకులకు గుర్తింపు



అనిల కుమారిని సత్కరిస్తున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రభుత్వంలో అంకిత భావంతో పని చేసే ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యముంటుందని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గం సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పొన్నూరు నియోజకవర్గంలోని ముఖ్య నాయకులకు పార్టీ అధిష్టానం జిల్లా స్థాయి పదవులను కేటాయించింది. పదవులు పొందిన వారిని సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆత్మీయంగా పలకరించి అభినందనలు తెలిపారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పార్టీ సీనియర్ నాయకురాలు మూకిరి అనిల కుమారిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు వెళ్లాలి

వెల్లటూరు(భట్టిప్రోలు): విద్యార్థులు లక్ష్యంతో ముందుకు వెళ్లాలని అప్పుడే పరీక్షల్లో సత్ఫలితాలు సాధిస్తారని పలువురు వక్తలు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు గురువారం 'ప్రేరణ తరగతుల వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. హైస్కూల్ నుంచి పరీక్షలకు హాజరవుతున్న 90 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన దాతలు కంచర్ల నిర్మల బాబు, కంచర్ల సుజాతలు రూ.10 వేలు వ్యయం చేసే పరీక్ష సామాగ్రి కిట్లను అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ పూర్వ హెచ్‌ఎం కనపర్తి నిరీక్షణరావు, ప్రస్తుత హెచ్‌ఎం కె. అరుణకుమారి, ఎస్‌ఎంసీ చైర్మన్ చందు సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]